క్లుప్తంగా

కూటమిని బేజారెత్తిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నిక


సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

ఆకివీడు: పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బేజారెత్తిపోతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలపై ఆయన సోమవారం మాట్లాడుతూ కూటమి నాయకులకు కంటి మీద కునుకు లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికలున్నాయన్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ మండల కేంద్రాల్లో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పట్టభద్రుల ఓట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నవమాసాలు నిండటంతో ప్రజలు పరిపాలనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారనడానికి ఎమ్మెల్సీ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ఓటమి భయంతోనే కూటమి ఓట్ల వేటలో పడిందన్నారు.

ఉండిలో 7,410 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

ఆకివీడు: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉండి నియోజకవర్గంలో 7,410 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పది పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఆకివీడు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 2049 మంది ఓటర్లు, ఉండి మండల కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లలో 1532 మంది ఓటర్లు, కాళ్ల మండలంలోని రెండు పోలింగ్ బూత్‌లలో 1465 మంది ఓటర్లు పాలకోడేరు మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాల్లో 2324 మంది ఓటర్లు ఓటు హక్కును ఈ నెల 27న వినియోగించుకోనున్నారు.

రామాలయం తొలగించొద్దు


రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కాళ్ల: మండల కేంద్రంలో రహదారిని ఆనుకుని ఉన్న రామాలయం తొలగించటానికి వీలు లేదంటూ సోమవారం రాత్రి గ్రామస్తులు రోడ్డెక్కారు. గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న రామాలయం తొలగిస్తారని గతవారం రోజులుగా చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీలకతీతంగా గ్రామస్తులు సోమవారం రామాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా రామాలయం తొలగించడానికి వీల్లేదని యువకులు, గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఒక్కసారిగా కొంతమంది యువకులు రహదారిపై బైఠాయించి నిరసన తెలపడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీనితో గ్రామపెద్దలు కలగజేసుకుని యువకులకు నచ్చచెప్పడంతో విరమించారు.

రాములోరికి మహా కుంభాభిషేకం


స్వామి వారి కుంభాభిషేకం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళా భక్తులు

ఆకివీడు: మండలంలోని సిద్దాపురం గ్రామంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో స్వామి వార్లకు అష్టబంధన సంప్రోక్షణ మహా కుంభాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. మరో భద్రాద్రిగా వెలుగొందుతున్న కొల్లేరు తీరంలోని కోదండ రామాలయాన్ని నిర్మించి 30 సంవత్సరాలైన సందర్భంగా అష్టబంధన మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకాలు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆఖరి రోజు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద కుంభారాధన, ఉక్త హోమం, ప్రదక్షిణ, వాస్తు హోమం, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, బ్రహ్మఘోష కార్యక్రమాలను అర్చకులు పీవీఎస్ రామత్రినాథ్ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నసమారాధన నిర్వహించారు.


చెత్త యూనిట్ వద్దంటూ నిరసన

నరసాపురం: మున్సిపల్ కార్యాలయం సమీపంలో తడి, పొడి చెత్తను వేరుచేసే యూనిట్‌ను ఏర్పాటును నిరసిస్తూ సోమవారం స్థానికులు వైఎస్సార్‌సీపీ పిరాయింపు కౌన్సిలర్ కేసరి గంగరాజు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. చెత్తను మున్సిపల్ కార్యాలయం వద్ద స్థలంలో వేయడం వల్ల స్థానికంగా ఉండలేమని, అనారోగాల బారిన పడతామని తెలిపారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. సీఐ బి.యాదగిరి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. కమిషనర్ ఎం అంజయ్య మాట్లాడుతూ యూనిట్ తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నామని నచ్చజెప్పారు.

సూక్ష్మ బ్యాక్టీరియాతో క్షయ

- ప్రాణాంతకంగా వ్యాధి.. మందులతో చెక్
- తగ్గిన మరణాల రేటు.. తగ్గని వ్యాధి విస్తరణ
- గత ప్రభుత్వంలో పౌష్టికాహారానికి రూ.1000 చెల్లింపు
- సహచరులకు అంటుకోకుండా అందుబాటులో మందులు


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



క్షయ వ్యాధికి గురైన ఊపిరితిత్తులు(బ్రోచర్)

ఆకివీడు: మనిషినే నిలువెల్లా తినేసే శక్తి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే సూక్ష్మజీవి (బ్యాక్టీరియా)కు ఉంది. ఊపిరి తిత్తులకు సంబంధించిన క్షయ వ్యాధి దేహంలోని అన్ని భాగాలను తాకే ప్రమాదం ఉంది. శ్వాస కోశాన్ని దెబ్బతీసి ఊపిరి ఆడకుండా చేయడమే దీని లక్ష్యం. పూర్తిగా అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో క్షయ వ్యాధి గ్రస్తులు అధికంగా ఉన్నారు. గత పదేళ్లగా ఆయా ప్రాంతాల్లో క్షయ సోకిన వారి సంఖ్య యథావిధిగానే కొనసాగుతుంది. ఈ వ్యాధితో నాలుగైదు మరణాలు కూడా సంభవిస్తున్నాయి. అపరిశుభ్రమైన వాతావరణం, దుర్గంధపూరిత వాతావరణం, రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్నప్పుడు, పౌష్టికాహారం తీసుకోని వారికి ఈ వ్యాధి సోకుతుంది.

పుట్టిన వెంటనే వ్యాక్సిన్ కొంత మేలు

పుట్టిన వెంటనే బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్‌ను వేస్తున్నారు. దీని వలన క్షయ వ్యాధి వ్యాపించకుండా ఉంటుంది. ఆహార నియమాల్లో లోపాలు, గుట్కా, పాన్‌పరాగ్, దుర్గంధపూరితమైన వాతావరణంలో మసలడం వలన వ్యాధి సోకుతుందని తెలిపారు. తీవ్రంగా దగ్గుతూ కఫం పడే వ్యక్తులు తక్షణం వైద్యులను సంప్రదించి క్షయ పరీక్షలు చేయించుకోవాలి. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, తోటి వారికి దూరంగా ఉండాలి. వ్యాధి సోకిన వ్యక్తులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేరు నమోదు చేయించుకోవలసి ఉంటుంది.

జగన్ ప్రభుత్వంలో పౌష్టికాహారానికి రూ.1000

క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశ్యంతో 2018లో ప్రభుత్వం రూ.500 ఆర్థిక సహాయాన్ని అందజేసేవారు. బలవర్ధకమైన ఆహారం తినడం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తుడు క్షీణించిపోకుండా ఉంటూ, మందులు వాడటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఇదే ఆర్థిక సహాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2024లో రూ.1000లకు పెంచారు. పెరిగిన ధరలకనుగుణంగా క్షయ వ్యాధిగ్రస్తుల పౌష్టికాహారానికి సహాయాన్ని రూ.2000లకు పెంచాలని కోరుతున్నారు.

ఇతరులకు సోకకుండా మందులు

క్షయ వ్యాధి అంటువ్యాధి. వ్యాధి ఉన్న వ్యక్తుల ఇళ్లలో మిగిలిన వారికి సోకే ప్రమాదం ఉంది. రోగి మందులు వాడుతున్నప్పటికీ కఫం నుంచి వచ్చే సూక్ష్మ క్రిములు ఇతరులు పీల్చే గాలి ద్వారా శ్వాసకోశాల ద్వారా అంటుకుంటుంది. రోగితో పాటు ఇంట్లో వారికి మందులు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుంది.

కాళ్లలో రోగుల సంఖ్య అధికం

క్షయ వ్యాధిగ్రస్తులు నియోజకవర్గంలోని కాళ్ల మండలంలో అధికంగా ఉన్నారు. ఏడాది కాలంగా మండలంలో సుమారు 85 మంది రోగులున్నట్లు గుర్తించారు. ఆక్వా పరిశ్రమల్లో పని చేసేవారు, ఇతర రాష్ట్రాల నుంచి ఆక్వా పనులకు వలస వచ్చే వారిలో రోగులున్నారు.

ఉండి నియోజకవర్గంలో వ్యాధిగ్రస్తుల వివరాలు.

మండలం	ప్రస్తుత రోగులు	పదేళ్ల క్రితం	రోగులు మరణాలు
ఆకివీడు	70	650	12
ఉండి	33	280	3
కాళ్ళ	85	720	13
పాలకోడేరు	60	560	5
మొత్తం	248	2,210	33

దీర్ఘకాలిక దగ్గు ప్రమాదకరం

దీర్ఘకాలిక దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటిండెంట్ గణేష్ విజ్ఞప్తి చేశారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా సోమవారం సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధికి ఉచితంగా మందులు, పౌష్టికాహారానికి రూ.1000 ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. తుమ్మినా, దగ్గినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భావన, నజరేనా వెంకటపతిరాజు, ఆదిలక్ష్మి, జిల్లా డాట్ ప్లస్ సూపర్‌వైజర్లు సత్యనారాయణ, ఆక్విడ్ ట్రీట్మెంట్ యూనిట్ సిబ్బంది సంజన, చంద్రారెడ్డి, రవిరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

మరణాలు తగ్గాయి



క్షయ వ్యాధిగ్రస్తుల మరణాలు జిల్లాలో తగ్గాయి. వ్యాధి ఉద్ధృతి క్రమంగా తగ్గింది. రోగులకు, రోగుల కుటుంబాలకు వ్యాధి అంటుకోకుండా మందులు ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేస్తున్నారు. గుట్కా, పాన్‌పరాగ్, మురుకివాడల్లో జీవనానికి దూరంగా ఉండాలి. పౌష్టికాహారం నిమిత్తం వ్యాధి గ్రస్తులకు రూ.1000 ప్రభుత్వం అందజేస్తుంది.

–చంద్రారెడ్డి, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్, భీమవరం

సత్తెమ్మ జాతర ముగింపు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉండి: పెదపుల్లేరు గ్రామంలో వేంచేసియున్న సత్తెమ్మ అమ్మవారి ఆలయ 60వ వార్షిక జాతర మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, గణపవరం, కైకలూరు తదితర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ ఆదివారం వరకు జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్లాస్టిక్ వస్తువులను విడనాడి, గుడ్డ సంచులనే వాడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో 120 మంది ప్రయాణికులకు నార సంచులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ సత్యనారాయణ, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, స్వచ్ఛంద సేవకులు కంతేటి వెంకటరాజు, గోపి, ఆర్టీసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పాలకోడేరు: మండలంలో 0–6 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఈ నెల 18 నుంచి 21 వరకు, 24 నుంచి 28 వరకు స్పెషల్ ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డయ్య తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, గ్రామ సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ క్రింది షెడ్యూల్ ప్రకారం స్పెషల్ ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 18, 19న పాలకోడేరు–1, శృంగవృక్షం–1, కోరుకొల్లు గ్రామ సచివాలయాల్లో, 20, 21న కుముదవల్లి, పెన్నాడ అగ్రహారం–1, మోగల్లు–1 గ్రామ సచివాలయాల్లో, 24, 25 తేదీల్లో గొల్లలకోడేరు, గొరగనమూడి, కొండేపూడి గ్రామ సచివాలయాల్లో, 27, 28న గరగపర్రు, విస్సాకోడేరు–1, వేంద్ర గ్రామ సచివాలయాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రంఐదు గంటల వరకు స్పెషల్ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు ఈ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

ఆత్మహత్య పేరిట వీడియో వ్యక్తి ఆచూకీ లభ్యం

నరసాపురం రూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో విడుదల చేసిన వ్యక్తి ఆచూకీ లభ్యమయింది. బాధితుడు కడప నుంచి భార్యకు ఫోన్‌చేసి బాగానే ఉన్నానని సమాచారం ఇవ్వడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారు పేటకు చెందిన యర్రంశెట్టి సతీష్ ఆదివారం బైక్‌పై మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి అప్పుల పాలయ్యానని, ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ వీడియో తీసి స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపించాడు. దీంతో అతని సోదరుడు భార్గవరామ్ మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొగల్తూరు ఏఎస్సై బండి సత్యనారాయణ మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. పేరుపాలెం బీచ్‌లో సతీష్ సెల్‌ఫోన్, బైక్ లభ్యమయ్యాయి. సతీష్ సముద్రంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అంతా భావించగా, సోమవారం సాయంత్రం కడప నుంచి సతీష్ భార్యకు ఫోన్‌చేసి బాగానే ఉన్నానని సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

టీ షర్టుల బహూకరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరం ప్రాథమిక పాఠశాల–2 విద్యార్థులకు దాత నడపన జగపతిరావు విరాళంతో టీ షర్టులను అందజేశారు. హెచ్ఎం వి.బేబీ సరోజ తెలిపారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్, పాల్గొన్నారు.

కూటమి హామీలు అమలు చేయాలి


సీడీపీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ఆకివీడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలకు రూ.26 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. 9 నెలలుగా జీతాలు పెంచని ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీఓ వాణీ విజయరత్నానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డి.కల్యాణి, మార్తమ్మ, కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, కె.కృష్ణకుమారి, రమా కుమారి, పి.శివలక్ష్మి, జి.రామకృష్ణ, కనకదుర్గ, పైడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్ఆర్‌కేఆర్ విజయకేతనం


భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో క్రికెట్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: గుంటూరు జెకెసి కళాశాలలో నిర్వహించిన చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ఫర్ ఏపీ కాలేజీ టీచర్స్ పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ టీచర్స్ టీం విన్నర్స్‌గా నిలవడం అభినందనీయమని కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కె.వి మురళీకృష్ణంరాజు అన్నారు. విజేతలను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా మాట్లాడారు. ఈనెల 16వ తేదిన జరిగిన ఫైనల్స్‌లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టుపై రెండు వికెట్ల తేడాతో తమ కళాశాల అధ్యాపకుల టీమ్ విజయం సాధించిందని గత 28 ఏళ్లుగా జరుగుతున్న చందూస్ క్రికెట్ టోర్నమెంట్లో ఎస్ఆర్‌కెఆర్ అధ్యాపక బృందం నాలుగు పర్యాయాల్లు విన్నర్స్‌గా, ఐదుసార్లు రన్నర్స్‌గా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవి కిరణ్‌వర్మ, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్ హరిమోహన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీల సమస్యలపై మంత్రికి వినతి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆకివీడు: వార్డు, విలేజ్ సచివాలయ హెల్త్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం అమరావతిలోని మంత్రి డోల వీరాంజనేయుల కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు పశ్చిమగోదావరి జిల్లా సంఘ అధ్యక్షురాలు ఎం .విజయలక్ష్మి చెప్పారు. అత్యవసర సేవల విభాగానికి చెందిన తమకు బయోమెట్రిక్ విధానానికి స్వస్తి చెప్పాలని కోరామన్నారు. బదిలీల అవకాశం కల్పించాలని, హెల్త్ కార్యదర్శులకు అలవెన్సులు మంజూరు చేయాలని, డిపార్టుమెంట్‌లో ఖాళీలు ఏర్పడిన వెంటనే ప్రామోషన్స్ కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశామని విజయలక్ష్మి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, రేషనలైజేషన్ త్వరలోనే ప్రకటిస్తామన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఈదూరి స్నేహలత, కె.సీతామహాలక్ష్మి పాల్గొన్నారని తెలిపారు.

బీసీ సంఘం అధ్యక్షురాలిగా దుర్గా రాజేశ్వరి


రాజేశ్వరికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: బీసీ సంక్షేమ సంఘ మండల మహిళా అధ్యక్షురాలిగా గంగడపాలెం గ్రామానికి చెందిన గుబ్బల దుర్గా రాజేశ్వరి నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యలమంచిలి మండల సమావేశం సోమవారం గంగడపాలెం గ్రామంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని మాట్లాడుతూ జనాభాలో సగం మంది ఉన్న మహిళలకు రాజకీయంగా కూడా సగ భాగం ఉండాలని సంఘంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గా రాజేశ్వరికి నియామక పత్రాన్ని అందజేశారు. ముత్యాలరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని మతాలకు చెందిన వారిని గుర్తించి సంఘంలో పదవులు ఇస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో బీసీ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు, ఇల్లింగి వర్మ, కోలాటి పెద్దిరాజు, గుబ్బల రంగారావు, నాగ శ్రీనివాస్, అనిశెట్టి సత్యవతి, గుబ్బల బేబి సరోజిని, జట్లా ధనలక్ష్మి, కొల్లు గంగా భవాని, ఓయిదని జయంతి, విశ్వనాధపల్లి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌లపై దాడులను అరికట్టాలి


భీమవరంలో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జర్నలిస్టలపై దాడులు పెరిగిపోయాయని మీడియా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టలపై దాడులు అరికట్టాలని, బలమైన చట్టాలు అమల్లోకి తేవాలని డిమాండ్ చేసింది. మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో భీమవరంలో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి మీడియా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా విలేకరిపై అధికార పార్టీ నేత దాడిచేసి చంపుతానని బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండా రామకృష్ణ, వేగిరాజు రాధాకృష్ణంరాజు, గూడూరి నాగరాజు, ఉండ్రు నరేష్, నర్సింహమూర్తి, నూకల సత్యనారాయణ, ఏబీఎస్ వర్మ, తాతారావు, కేతా సత్యనారాయణ, రవి, వి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులపై దాడులు అమానుషం


ఎస్సై నసీరుల్లా, డీటీ రత్నకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉండి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు.

ఉండి: కూటమి ప్రభుత్వంలో విలేకరులపై దాడులు అమానుషమని ఉండి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి చిట్టూరి జోషి అన్నారు. మన్యం జిల్లా పార్వతీపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు స్థానిక ప్రజాశక్తి విలేకరిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ ఉండి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు. అనంతరం ఎస్సై ఎండీ నసీరుల్లాకు ఫిర్యాదు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరిపై దాడికి నిరసనగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం క్లబ్ కార్యదర్శి జోషి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా విధులు నిర్వర్తిస్తున్న మీడియా ప్రతినిధులపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రజలకు మంచి జరగాలని తపనతో విలేకరులు విధులు నిర్వర్తిస్తారని ప్రజలకు మంచి చేయకపోవడంతో మీడియా ప్రభుత్వాన్ని మేల్కొల్పుతుందని అన్నారు. కానీ నిజం చెప్పినా, రాసినా దాడికి తెగబడుతుంటే ప్రజాస్వామ్యం కూనీ అవుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు కైలే రాజు, కోశాధికారి బొండాడ సత్యనారాయణ,సభ్యులు చాలంటి రత్నరాజు,గెద్దా అప్పారావు,పీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రీ–సర్వే పనులు వేగవంతం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: రీ–సర్వే పనులను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో రీ–సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ మాట్లాడుతూ ముందుగా రైతులకు నోటీసులు అందజేయాలన్నారు. నోటీసులు అందజేసినా ఆరుగురు రైతులు రావడం లేదని గ్రామ సర్వేయర్ జేసీ దృష్టికి తీసుకురాగా, వారిని పిలిచి మాట్లాడి, సర్వే పనులు పూర్తయ్యేలా సహకరించాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి కోరారు. రైతుల సమక్షంలోనే రీ–సర్వే పనులు చేయాలన్నారు. భూయజమానులకు తెలియకుండా సర్వే పనులు చేయరాదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.రైతుల సమక్షంలో రీసర్వే చేయాలన్నారు. భూ యజమానులకు తెలియకుండా సర్వే పనులు చేయరాదని తెలిపారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, జిల్లా సర్వే అధికారి కే.జాషువా, తహసీల్దార్ సునీల్ కుమార్, రెవెన్యూ, రైతులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసాపురం: స్థానిక 2, 31 వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పనుల్లో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని యజమానులకు సూచించారు.

యానాదుల సమస్యలపై వినతి


ఆర్డీఓకు సమస్యలు వివరిస్తున్న గురుప్రసాద్

నరసాపురం: యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పాలకొల్లుకు చెందిన యానాదులతో సబ్‌కలెక్టర్ కార్యాయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీఓ దాసి రాజుకు సమస్యలు వివరించారు. ఇప్పటికీ చాలామంది యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు లేవని గురుప్రసాద్ తెలిపారు. యానాదుల పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు.